## శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, జనవరి 10 ప్రభాతవార్త ప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో తిరుపతి ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, అసెంబ్లీ అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్ అనిల్‌కుమార్, పత్తిపాడు ఎమ్మెల్యే పివిప్రసాద్ శ్రీవారిని దర్శించుకున్నారు. లయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## 7 నాటు తుపాకీలు స్వాధీనం

గుడిపాల, జనవరి 10 ప్రభాతవార్త:



గుడిపాల చిత్తపార అటవీ ప్రాంతంలో ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించగా ఏడు నాటు తుపాకీలు లభ్యం కావడంతో వీటిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ అటవీ జంతువులు, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని, ఎవరైనా నాటు తుపాకీలు కల్గి వున్నట్లైతే పోలీసులకు అప్పగించాలని కోరారు. పోలీసు తనిఖీల్లో ఎక్కడైనా నాటు తుపాకీలు పట్టుబడితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు చలపతి, మునివేలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి సత్తా ఎవరిది!?



### టిక్కెట్ జనసేన పార్టీకా!?టిడిపి కేనా!? అయోమయంలో ఆశావహులు

ప్రభాతవార్త-తిరుపతి:
సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న సమయంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ప్రాధాన్యత ఉన్న తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ టిడిపి,జనసేన పార్టీల్లో ఎవరికి ఇస్తారనేది సందిగ్ధంగా మారింది. తిరుపతి టిక్కెట్‌పై తొలినుంచి ఆశిస్తున్న తెలుగుతమ్ముళ్ళకు ఈ సారి ఎన్నికల్లో జనసేనతో పొత్తుతో మొండిచేయి తప్పదనే వ్యాఖ్యలు మొదలయ్యాయి. నెలరోజుల క్రిందటి వరకు తిరుపతిలో తెలుగుదేశంపార్టీ తరపున పోటీకి పలువురు తెలుగుతమ్ముళ్ళు ,పార్టీకండువా కప్పుకున్న ఒకరిద్దరు నేతలు కూడా సై అన్నారు. ఆ దిశగా పావులు కదిపి అది .నేత,యువనేతను కలిసి తమ వైపు నుండి సమ్మతిని తెలియజేశారు. అయితే నెలరోజులుగా మారిన రాజకీయపరిణామాల మధ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి,చిత్తూరు, మదనపల్లి అసెంబ్లీ టిక్కెట్‌లపై జనసేన పార్టీ నేతలు కూడా పట్టువదలని విక్రమార్కుల్లా ఉన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి అసెంబ్లీ టిక్కెట్ కోసం పోటీపడిన నాయకులకు వెలక్కాయనోట్లోపడ్డట్లయిందనే చర్చ సాగుతోంది. ఇంతకీ తిరుపతి సత్తా చాటే నాయకుడెవరనేది కూడా జనసేనలో తెరపైకి వచ్చింది. రాజకీయ పొత్తులో జనసేనకు ఇచ్చినా టిడిపి నేతలు కలిసి పనిచేసి విజయపతాకం ఎగురవేయాలనేది అధినేత చంద్రబాబు నిర్దేశం. టిడిపిలో,జనసేన పార్టీలో మాత్రం ఇంకా తమకు టిక్కెట్ ఇస్తారని నేతలు కాలర్‌ఎగరేసుకుని ఎవరికి వారే అభ్యర్థులమని ప్రకటించుకుంటుండటం పార్టీ శ్రేణుల్లోనేగాక జనాన్ని అయోమయానికి గురిచేస్తున్నారు. గతకొంతకాలంగా అభ్యర్థులు ఎవరనేది తేల్చలేకపోతుండటం...తామే పోటీచేస్తున్నామనే ప్రకటనలతో ఓటర్లను విస్మయానికి గురిచేసేలా ఉంది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు తన సొంత తిరుపతి జిల్లాతో బాటు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరుజిల్లాలో అన్ని చోట్లా ఎవరికి టిక్కెట్లు ఇస్తామనేది ప్రకటన రాలేదు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను క్షేత్రస్థాయిలో గట్టిగా పనిచేయాలని ,ప్రజలతో కలిసి వారి సమస్యలపై పోరాటం చేయాలని, అదికార పార్టీనేతల తీరుపై గట్టిగా ప్రశ్నించాలని నిర్దేశం చేస్తున్నారు. ఈ దఫా అభ్యర్థుల ఎంపికలో నిక్కచ్చిగా వ్యవహరిస్తానని, మాటవరుసకో, కుటుంబంలో వారికో, గత ఎన్నికల్లో ఓడిపోయిన వారికి, మొహదాక్షిణ్యంతో టిక్కెట్టివ్వబోమని బాబు తేల్చిచెప్పేశారు. పార్టీకోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రజల అభిప్రాయం మేరకు ఎన్నికల్లో గెలిచే వారికి, పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధానమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో ఎవరికి టిక్కెట్లు ఖరారవుతాయనేది ప్రకటన వెలువడే వరకు ఉత్కంఠతే.

## వెంకటగిరి టిడిపి టికెట్ కోసం త్రిముఖ పోటీ!

### అయోమయంలో క్యాడర్



ఆనం రామనారాయణ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, మస్తాన్ యాదవ్

వెంకటగిరి, జనవరి 10, ప్రభాతవార్త
వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టికెట్ కోసం ముగ్గురు నేతలు పోటీ పడుతుండడంతో పార్టీ నాయకులు అయోమయం నెలకొని వుంది. మాజీ ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలగల మస్తాన్ యాదవులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ రాపూరు, వెంకటగిరిలలో అన్నా క్యాంటీన్ నిర్వహించడం, పలు సేవా కార్యక్రమాలు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన 2009, 14 సంవత్సరంలో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తనకే పార్టీ టికెట్ వస్తుందని కురుగొండ్ల ధీమాగా ఉన్నారు. ఎమ్మెల్యే ఆనం రామాయణ రెడ్డి మొదట ఆత్మకూరు నియోజకవర్గం టిడిపి టికెట్టు అడిగినట్లు పార్టీ వర్గాలు చర్చించుకున్నారు. తాను సిట్టింగ్ ఎమ్మెల్యే అయినందువల్ల వెంకటగిరి టికెట్ ఇవ్వాలని ఇక్కడి నుండి పోటీ చేస్తానని ఆనం అంటున్నట్లు ఆయన అనుచరులు తెలిపారు. వెంకటగిరిలో తనకు అన్ని వర్గాల వారు మద్దతు తెలుపుతారని ఆనం ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసిపి వారు కూడా తనతో కొందరు మంచి సంబంధాలు కలిగి ఉన్నారని ఎన్నికల్లో టిడిపిలోకి వస్తారని ఆయన భావిస్తున్నారు. వెంకటగిరి వాసైన డాక్టర్ మస్తాన్ యాదవ్ డాక్టర్‌గా హైదరాబాదులో స్థిరపడ్డారు. అయితే ఆయన వెంకటగిరిలో ఇక్కడ వారిపై ఉన్న మమకారంతో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన పార్టీకి చేస్తున్న సేవలకు పార్టీ గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌తో పాటు నియోజకవర్గం మొత్తం డాక్టర్ మస్తాన్ యాదవ్ నడిచారు. తనకే టికెట్ వస్తుందని ఆయన ధీమాగా ఉన్నారు. బీసీ సామాజిక వర్గం నియోజకవర్గంలో ఎక్కువగా ఉండడంతో తన గెలుపు సులువుగా ఉంటుందని మస్తాన్ యాదవ్ భావిస్తున్నారు. టిడిపి టికెట్ కోసం ముగ్గురు పోటీపడుతుండడంతో టికెట్ ఎవరికి వస్తుంది అని పార్టీ నాయకులు సందిగ్నంలో రా కదిలిరా కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు వస్తారని ఆయన అభ్యర్థిని ప్రకటించన నాయకులు భావించారు. అయితే చంద్రబాబు పర్యటన వాయిదా పడింది. మొత్తం మీద టిడిపి టికెట్ కోసం త్రిముక పోటీ కొనసాగుతోంది.

## 22న ఓటర్ల జాబితా విడుదల : డిఆర్ఓ



చిత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త:
జనవరి 22వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేయనుండటంతో డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయి విచారణ జనవరి 12వ తేదీలో పూర్తవుతుందని, ఓటరు దరఖాస్తులు మాత్రం నిరంతరం స్వీకరించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అన్నారు. డిఆర్ఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం డిఆర్ఓ రాజశేఖర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతుల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ప్రధాన కేంద్రాలు, విద్యా సంస్థల్లో ఓటర్ల అవగాహన కోసం ఇవిఎంలను వుంచడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో స్థానం కోసం ఓటర్ల నుండి నిరంతరం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల కమీషన్ పోలింగ్ కేంద్రాల్లో కొన్ని నిర్థిష్ట ప్రమాణాలతో వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగిందని, ఈ మేరకు చర్యలు తీసుకొంటామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం ఎన్నికల కమీషన్ నిబంధనలకు లోబడి వసతులు కల్పించాలని కోరితే పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో గంగరాజు(సిపిఎం), వెంకిటీల సురేంద్రకుమూర్(టిడిపి), ఉదయ్‌కుమార్(వైఎస్ఆర్‌సిపి), ఎన్నికల సెక్షన్ సూపరిటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం, వివిపాట్‌లపై అవగాహన ఉండాలి

### డిఆర్ఓ పెంచల కిషోర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 10, ప్రభాతవార్త



రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవిఎం, వివి ప్లాట్‌లపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నప్పుడే ఎన్నికలు నిర్వహణ సజావుగా ఉంటుందని డిఆర్‌ఓ పెంచల కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిఆర్‌ఓ ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్‌లకు అందరు అధికారులకు జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కోదండ రామిరెడ్డి పోస్టల్ బ్యాలెట్, ఈవిఎంల వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన మాడ్యూల్స్ ప్రకారం పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేల చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్, తదితర మౌలిక ఏర్పాట్లు సరిచూసుకోవాలని తెలిపారు. ఎన్నికలో పాల్గొని సిబ్బంది చేయవల్సిన విధులు చర్యలు, ఓటింగ్ యంత్రాల వినియోగం పై ముందస్తు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ నిర్వహణలో చేపట్టాల్సిన వివిధ ఏర్పాట్లు పై ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, నియోజకవర్గ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర నూతన క్రీడా చరిత్ర

### - మంత్రి రోజా



నగరి, జనవరి 10 ప్రభాతవార్త: ఆడుదాం ఆంధ్ర నూతన క్రీడా చరిత్ర అని మంత్రి రోజా అన్నారు. బుధవారం స్థానిక కేవీకే మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ఆమె ప్రారంభించారు. సత్రవాడ, ముడిపల్లి టీం మధ్య క్రికెట్ పోటీల్లోను, కాకవేడు, అడవికొత్తూరు టీంల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లోను మంత్రి క్రీడాకారులతో పాటు ఆడుతూ ఉత్సాహపరచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి జాతీయ అంతర్జాతీయస్థాయిలో విజయం సాధించే విధంగా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. జీవితంలో అయినా చదువులో అయినా క్రీడల్లో అయినా గెలుపు సాధించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. గెలవడానికి చిత్తశుద్ధిగా కష్టపడి ప్రాక్టీస్ చేసి పోటీ పడితే గెలుపు వచ్చేది పక్కా అన్నారు. గెలిచినప్పుడు చరిత్రలో నిలిచి పోతామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విజేతలకు గ్రూప్ వన్ పోస్టులతో పాటు పలు అకాడమిలు నిర్మించి క్రీడాకారులకు కోచింగ్ క్యాంపులు పెట్టి ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 15,004 సచివాలయాల పరిధిలోను పోటీలు ముగిసి మండల స్థాయి పోటీలు ప్రారంభం అవుతోందన్నారు. ఈ పోటీల అనంతరం నియోజకవర్గస్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయి అంటూ 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు రాష్ట్రంలో పండుగ వాతావరణాన్ని సృష్టించిందన్నారు. కాగా కార్యక్రమ ప్రారంభంలో మంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూజ చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, వైస్ ఎంపీపీలు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రలో ఘర్షణ..

### - ద్రవిడ వర్సిటీలో పోటీల నిర్వహణ.. పదిమంది ఆస్పత్రి పాలు !!

కుప్పం, జనవరి 10 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించేందుకు గాను ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీలు కాస్తా కొట్టుకుందాం.. రా అనే స్థాయికి చేరాయి. గుడుపల్లె మండలంకు సంబంధించిన క్రీడా పోటీలను ద్రవిడ వర్సిటీ క్రీడామైదానంలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కనమనపల్లి, గుడుపల్లె గ్రామాలకు చెందిన జట్ల మధ్య కబడ్డీ పోటీలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అయితే ఆటలో పాయింట్ల విషయంగా ఇరుజట్ల మధ్య వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. ఇరు జట్లకు చెందిన క్రీడాకారులు చైర్లద్వారా, కర్రల ద్వారా ఒకరినొకరు కొట్టుకున్నారు. వీరికి ఆయా గ్రామాల ప్రజలు కూడా కొంత తోడయ్యారని సమాచారం. దీంతో ఇరుజట్ల మధ్య ముష్టియుద్ధాలు జరిగాయి. దీంతో సుమారు పదిమందికి గాయాలపాలు కాగా వారు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరినట్లు సమాచారం. అధికారులు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.



కొట్టుకుంటున్న యువకులు

## సామాజిక సమతా సంకల్ప ఛాయా చిత్ర ప్రదర్శన ప్రారంభించిన జెసి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 10, ప్రభాతవార్త
సామాజిక సమతా సంకల్ప స్ఫూర్తిగా డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణ నందు డిఆర్‌ఓ పెంచల కిషోర్, జిల్లా సహకార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య , సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్యలతో కలిసి ప్రారంభించారు. ఛాయా చిత్ర ప్రదర్శన ప్రారంభానికి ముందు జెసి డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో దాదాపు రూ. 400 కోట్లతో 20 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో 125 అడు గుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో సామాజిక సమతా సంకల్ప (జన్ భాగీదారీ) కార్యక్రమాలను జిల్లాలో ఈ నెల జనవరి 4 నుండి 19 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ ఏర్పాటు చేసింది.

### కన్నుల పండువగా

## గౌరమ్మ ఉత్సవం



శ్రీకాళహస్తి,జనవరి 10 ప్రభాతవార్త
ధనుర్మాసం ప్రతి రోజూ పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో గౌరమ్మ దర్శనం ఇవ్వటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో ఆలయ దర్శన వేళలను మార్చారు. వేకువ జాము 3గంటలకే దర్శనాలకు అనుమతిస్తున్నారు.ఈ ఏడాది ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇఒ కె.యస్ రామారావులు భక్తులకు గౌరమ్మ దర్శనం చేసుకునే విధంగా ఆలయం నుంచి బయలుదేరే ముందు పట్టణ ప్రజలకు తెలిసే విధంగా 'సైరన్' ఏర్పాటు చేసారు. గౌరమ్మను ముస్తాబు చేసి గ్రామోత్సవానికి బయలుదేరే ముందు సైరన్‌ను మోగించటం వల్ల నాలుగుమాడావీదుల్లోని ప్రతి గడపవద్ద గౌరమ్మకు హారతులిస్తున్నారు.బుధవారం గౌరమ్మ ఉత్సవంతో పాటు ఆలయ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రియాజ్‌బాషా, వారి సిబ్బంది పర్యవేక్షించారు.

### 49 కేజీల

## వెండి నాణేలు స్వాధీనం



గుడిపాల, జనవరి 10 ప్రభాతవార్త:
మండల పరిధిలోని ముత్తురాసికుప్పం చెక్‌పోస్ట్ వద్ద గుడిపాల పోలీసులు బుధవారం బిల్లులు లేని 49 కేజీల వెండి నాణేలను స్వాధీనం చేసుకొన్నారని వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు తాను, ఎస్ఐ రామ్మోహన్ సిబ్బందితో కలిసి బుధవారం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడు నుండి చిత్తూరు వైపుకు ఒక క్రెటా కార్ వెళ్తుండగా అనుమానంతో నిలుపుదల చేశామన్నారు. ఈ కారులో బిల్లులు లేని 35 లక్షల రూపాయల విలువైన 49 కేజీల వెండి నాణేలు లభించాయని వీటిని స్వాధీనం చేసుకొని తిరుపతి కమర్షియల్ టాక్స్ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

### మాజీ మంత్రి అమరనాథరెడ్డి



గంగవరం, జనవరి 10, ప్రభాతవార్త :
జగన్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిం దని, ముఖ్యంగా అంగన్‌వాడీ,మున్సిపల్, ఆశావర్కర్లు ఇలా ప్రతి ఒక్క వర్గం రోడ్లపైకి వచ్చాని మాజీ మంత్రి అమరనాథరెడ్డి మండిపడ్డారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి నాలుగవరోజు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కల్లుపల్లె,గంగవరం పంచాయతీల పరిధిలోని మల్లేరు,సామరాజుపల్లె, బూడిదపల్లె,కూర్నిపల్లె, చీలవారిపల్లె, వి రామాపురం,కొత్తఇండ్లు గ్రామాల్లో ఆయన పర్యటించారు.ఈ నేపథ్యంలో బాబు ష్యూరిటీ..భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ నాయకుడు తన 40 ఏళ్ళ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడుగా ఎదిగారని,తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి కేరాఫ్ అడ్రస్సుగా ఆర్థిక నేరచరిత్రతో ముఖ్యమంత్రి జగన్ ఎదిగారని ఆయన ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సోమశేఖర్ గౌడు,ప్రధానకార్యదర్శి ప్రతాప్‌రెడ్డి,ఉప సర్పంచ్ రామోహన్ నాయుడు,సతీష్‌నాయుడు, విజయ్,సుబ్బారెడ్డి, భరత్,కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్,అడ్వకేట్ సుబ్బరామయ్య, నాయకులు వెంకటేష్‌నాయుడు,బత్తిగౌడు,మాజీ సర్పంచ్‌లు మురళీ,రంగప్ప, కె.చిన్నబ్బ,పరమశివ,సూరి,హరి,వసరాయగౌడు,దేవేంద్రరెడ్డి,రెడ్డెప్పరెడ్డి,జయసింహ,ముబారక్‌తాజ్,వసరాయప్ప,నాగరాజగౌడు,శ్రీనివాసులు,నారాయణ,రాజేష్,పవన్,తులసీ,రాఖీ,దుర్గ,గోవర్ధన్,వరాజీ ఎంపిపి మురళీలతో పాటు పలమనేరు, వికోట, పెద్దపంజాణి,బైరెడ్డిపల్లె మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ఒకనాడు మహర్దశ: నేడు అధోగతి

### పంచాయతీ రాజ్ అతిథి గృహం దయనీయ స్థితి

### ఊడ్చే నాధుడూ కరువు



శ్రీకాళహస్తి,జనవరి 10 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న పంచాయతీ రాజ్ అతిథి గృహం దయనీయ స్థితిలో ఉంది. ఇక్కడ అతిధుల మాట అటుంచితే కనీసం శుభ్రం చేసే దిక్కు కూడా లేదు.ఇక్కడ అడుగుపెడితే దుర్గంధం స్వాగతం పలుకుతుంది.ఒక నాడు రాజకీయనాయకులతో సందడిగా ఉన్న అతిధి గృహాన్ని అభివృద్ధి పరచుటకు గత పాలకులు ప్రాధాన్యత ఇచ్చారు. అధికారుల సమీక్షలు ఇక్కడే జరిగేవి.దాంతో ఇక్కడ ఏసి గదులు, మొదటి అంతస్థు, మొదటి అంతస్థులోకి వెళ్ళటానికి చక్కగా లిఫ్ట్ కూడా ఏర్పాటు చేసారు. అయితే ప్రస్తుతం సమావేశం హాలులో ఎంచక్కా ముఖ్యమంత్రి ఫోటో ఉంది కానీ గదిని శుభ్రపరచే దిక్కు కూడా ఉన్నట్లు లేదు. ప్రస్తుతం ఈ అతిధిగృహాన్ని మండల పరిషత్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**నేడు సమీక్షలే లేదు:**

గత ప్రభుత్వంలో నాయకుడు పరిపాలనా పరంగా నిర్ణయాలు తీసుకునేందుకు అధికారులతో పంచాయతీ రాజ్ అతిది గృహంలో సమీక్షా సమావేశాలు వేర్వేరుశాఖ లతో నిర్వహించే వారు. వచ్చే రాజకీయ నాయకులతో మాట్లాడటానికి ప్రత్యేక గది ఏర్పాటు చేసుకున్నారు. అయితే ప్రస్తుత నాయకుడు ఇక్కడకువచ్చి సమీక్షించే పరిస్థితి లేదు. సమీక్షలే లేదు. దాంతో అతిథి గృహం అంధకారంగా మారింది. కళ తప్పింది. నేడు ఇక్కడ పరిస్థితి పరిశీలిస్తే 'చీకటి పనులకు నిలయమా?'అన్నట్లు మారింది.ఇక్కడ భోజనాలు తిని పారేసిన ఇస్తర్లు,చెత్తా చెదారం, మద్యం బాటిళ్ళు కనబడుతున్నాయి. నెలకొకరోజు అయినా శుభ్రం చేస్తున్నారో లేదో అనే సందేహం కల్గుతుంది. ఇక్కడి దుస్థితి గురించి సంబంధిత అధికారి ని వివరణ కోరటానికి ప్రయత్నించగా ఆయన చరవాని తీయలేదు.

## భీమినేని చిట్టిబాబుకు సన్మానం

పాలసముద్రం, జనవరి 10 ప్రభాతవార్త:



రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన భీమినేని చిట్టిబాబును బుధవారం అక్కన్నగారిపల్లికి చెందిన చిత్తూరు పార్లమెంటు టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, నాయకులు మురుగదాసన్, దుర్గా, శేఖర్, ప్రశాంత్, సాగర్, వెంకట్ తదితరులు సన్మానించారు. పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భీమినేని చిట్టిబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మండల స్థాయి క్రీడా పోటీలుప్రారంభం

సదుం,జనవరి10ప్రభాతవార్త

మండల పరిదిలో ఇటీవల ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కింద గ్రామాలలో క్రీడల పోటీలు నిర్వహించారు. అక్కడ గెలుపొందిన జట్లుకు వ్యక్తిగత క్రీడాకారులకు బుధవారం నుంచి సదుంలో మండల ఎ ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా సదుం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడలను ఎంపీపీ ఎల్లప్ప ప్రారంభించారు. క్రికెట్ పోటీలు నిర్వహిం చారు. ఎంపీ డీఓ వరప్రసాద్, సర్పంచి ఉషారాణి, పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడలకు పేదరికం అడ్డుకారాదన్నదే జగనన్న లక్ష్యం

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త

క్రీడలకు పేదరికం అడ్డుకారాదన్నదే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని పలువురు వక్తలన్నారు. స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించారు. పుంగనూరు నియోజకవర్గంలో క్రీడాభివృద్ధిని సాధించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మినీస్టేడియం ఏర్పాటుకు ఆయన హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసారు. అనంతరం జరిగిన పురుషుల డబుల్స్ బ్యాట్మింటన్ పోటీల్లో మిఠాయి సుబ్రమణ్యంసింగ్, బాలాజీలు మండలస్థాయిలో గెలుపొందారు. అదే విధంగా మహిళల విభాగంలో ఎ.కొత్తకోట టీమ సభ్యులు గెలుపొందారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు పొల్గొన్నారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, జెసిఎం కన్వీనర్ రుక్మిణమ్మ, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో, హెచ్‌డిఎస్ ఛేర్మన్లు రవిచంద్రారెడ్డి, కె.కళ్యాణ్‌భరత్, ఎంపిడిఓ సుధాకర్, సర్పంచులు కృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, షంషీర్,ఎంపిటీసీలుతొండాశ్రీరాములు,రూపారేఖ,మండలంలోనిఆడుదాంఆంధ్రక్రీడాకారులు పాల్గొన్నారు.

## నల్లపల్లె గ్రామంలో వికసిత్ భారత్

ఎస్ఆర్‌పురం, జనవరి 10 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచార రథం వికసిత్ భారత్ బుధవారం మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ నల్లపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణయ్య, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎపిఎం రోజా, ఎంఇఓ అరుణాచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా ఆటలు ప్రారంభం

బంగారుపాళ్యం, జనవరి 10 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సచివాలయ పరిధిలో ఈ పోటీలు నిర్వహించగా గెలుపొందిన జట్ల మధ్య మండల స్థాయిలో ఈ పోటీలను బుధవారం చేపట్టగా ఎంపిపి అమరావతమ్మ లాంఛనంగా ప్రారంభించారు. బంగారుపాళ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, క్రికెట్, నలగాంపల్లి క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్, ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో బ్యాడ్మింటన్, తగ్గువారిపల్లి సచివాలయం ఎదుగ వాలీబాల్, ఖోఖో పోటీలను అధికారులు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొంది నగదు బహుమతి పొందనున్నట్లు ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జీ తహసిల్దారు అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, సర్పంచ్‌లు ఉమాదేవి కృష్ణమూర్తి, వాణిప్రియ, ఉప సర్పంచ్ కామరాజు, సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగదీష్, జిల్లా బిసీ నాయకుడు సురేంద్రనాథ్, కో-అప్షన్ సభ్యుడు అన్ను పాల్గొన్నారు.

## ధర్మపోరాట సభను విజయవంతం చేయండి

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త

ఈనెల 13న జరగబోయే పుంగనూరు ధర్మపోరాట సభను విజయవంతం చేయాలని బిసివై పార్టీ నాయకుడు హరిబాబుయాదవ్ పిలుపునిచ్చారు. ఈమేరకు మండల వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేపట్టారు. చిన్నకొండామర్రిలో ఆయన మాట్లాడుతూ బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ పుంగనూరు మండలం చదళ్ళల్లో ధర్మపోరాట సభ జరుగుతుందన్నారు. సభను విజయంతం చేయాలని కోరుతూ ఇంటింటికీవెళ్ళికరపత్రాలందించారు. బిసివైపి నాయకులు చిన్నికిషోర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ చేరిన శ్రీరాముని అక్షింతలు

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త

శ్రీరాముని అక్షింతలను సనాతన ధర్మపరిరక్షకులు పట్టణంలో ఇంటింటికీ చేర్చారు. సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్‌ప్రకాష్‌ల ఆధ్వర్యంలో గంధోడి ప్రవీణ్‌కుమార్, శబరీ, అనూరాధా, లింగప్ప, శేఖర్, వెంకట్రమణ తదితరులు పట్టణంలోని ప్రతి ఇంటికీ వెళ్ళి శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేసారు. అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ట రోజున మండల వ్యాప్తంగా పలు కార్యక్రమాలు జరుగుతాయని వారు వివరించారు.

## ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర పోటీలు

జడ్పీటిసి సభ్యులు సుకుమార్

వెదురుకుప్పం, జనవరి 10 ప్రభాతవార్త :

క్రీడాకారులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తుందని జడ్పీటీసీ సభ్యులు చల్లం పాళ్యం సుకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో బుధవారం గ్రామస్థాయిలో గెలుపొందిన 13 సచివాలయం పరిధిలోని క్రీడకారులకు మండల స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడ కారులలో దాగివున్న ప్రతిభను రాష్ట్రస్థాయికి తీసుకువచ్చి తగిన గుర్తింపు కల్పిండం కొరకు క్రీడలు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. వెదురుకుప్పం సర్పంచ్ శిల్పా, పుత్తూరు మార్కెటింగ్ మాజీ ఉపాధ్యక్షులు మరకాలకుప్పం రామయ్య ఆధ్వర్యంలో క్రీడకారులకు కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించారుఎంపిడివో ప్రేమ్‌రాజ్‌కుమార్, ఆడుదాం ఆంధ్ర ప్రత్యేకాధికారి డాక్టర్ రూప, సర్పంచ్‌రాజేశ్వరి పెద్ది రెడ్డి, ఎంపిటిసి పుత్తూరు రాధికపురంధర్ రెడ్డి, మండల గృహసార ధుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, నాయకులు బొజ్జారెడ్డి,ఏపివో ఇందు, డీడీవోలు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ బాలాజీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, క్రీడకారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు రక్తదాన శిబిరాలు

చిత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రం చిత్తూరు, డివిజన్ కేంద్రాలు పలమనేరు, కుప్పం, నగరిల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులుఒ ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో జిల్లా ప్రధాన ఆసుపత్రి, కుప్పంలో పిఇఎస్ మెడికల్ కళాశాల, పలమనేరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జిల్లా ప్రధాన ఆసుపత్రికి వారు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండగా, నగరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. స్వచ్ఛంధంగా రక్తదానం చేసే వారు ఆయా డివిజన్ కేంద్రాల్లోని ఆర్డీఓముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఇన్‌ఛార్జీ కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

పాలసముద్రం, జనవరి 10 ప్రభాతవార్త:



మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపిడిఓ ఎం.రామనాథరెడ్డి బుధవారం పాలసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు పాలసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల, వెంగళరాజు కుప్పంజడ్పీఉన్నతపాఠశాలలోప్రారంభమయ్యాయి.కార్యక్రమంలో తహసిల్దారు బాబు, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ఎపిఓ మార్గరేట్, ఉపాధి హామీ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కావేరిరాజపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

**పాలసముద్రం, జనవరి 10 ప్రభాతవార్త:** మండలంలోని కావేరిరాజపురం గ్రామంలో బుధవారం మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్‌లు ఇంటింటికి వెళ్ళి చంద్రబాబునాయుడు అమలు చేయడానికి సిద్ధం చేసిన పథకాలను వివరించారు. తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది విద్యార్థులు వుంటే వారందరికి రూ.15 వేలు ఇస్తారని, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఏడాదికి రూ.15 వేలు, దీపం పథకం కింద ఏడాదికి ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సెమిస్టర్ ఫలితాల్లో విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చిత్తూరురూరల్, జనవరి 10 ప్రభాతవార్త:

శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంసిఏ 3వ సెమిస్టర్‌నందు విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారని విద్యాసంస్థల అధినేత డా. ఎం.తేజోమూర్తి తెలిపారు. ఎన్.సరస్వతి(8.31),కె.హరిప్రసాద్(8.25),పి.ఉమామహేశ్వరి(8.24), జ్యోతీశ్వరి(8.19),మహతి(8.19) జిపిఎ పాయింట్స్ సాధించారని పేర్కొన్నారు. కాగా విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ డా. శైలజామూర్తి, ప్రిన్సిపల్‌డా.కె.జయంత్,అధ్యాపకులుశ్రీనివాసన్,రఘుపతి,దినకర్,కవిత,చంద్రమౌళిలుఅభినందించారు.

## భక్తుల చేతుల మీదుగా సాయిలింగేశ్వరునికి లింగాభిషేకం

చిత్తూరురూరల్, జనవరి 10 ప్రభాతవార్త:

చిత్తూరునగరం, గిరింపేటలోని శ్రీసత్యసాయి సేవా మందిరం నందు బుధవారం ఉదయం భక్తుల చేతులు మీదుగా సాయిలింగేశ్వరునిరి రుద్రాభిషేకం నిర్వహించినట్లు సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు మదుసూదనం తెలిపారు. పరిమళ పుష్పాలు, పాలు,పెరుగు, నెయ్యి, కొబ్బరినీళ్లు, చెరకురసం, పంచామృతం ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. మహామంగళహారతి అనంతరం భక్తులకుప్రసాదవితరణ చేసారు.కన్వీనర్ శేషనారాయణలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 14న గోదారంగనాయకుని కళ్యాణోత్సవం

చిత్తూరురూరల్, జనవరి 10 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణంలో వెలసిన ప్రముఖ కోదండ రామస్వామి ఆలయంలో ఈనెల 14వ తేది ఆదివారం సాయంత్రం గోదారంగనాయకుని కళ్యాణోత్సవంను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు వేణుగోపాల్ స్వామి తెలిపారు. మహావిష్ణువుకి ధనుర్మాసం అత్యంత ప్రీతికర మాసం కావడంతో ఈ కళ్యాణోత్సవంను నిర్వహిస్తున్నామని, ఈ కళ్యాణోత్సవంలో భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## 14న బిసివై సంక్రాంతి ముగ్గులపోటీ

పుంగనూరు, జనవరి 10, ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సంక్రాంతి సందర్బంగా ఈనెల 14న వాట్సప్ ద్వారా ముగ్గులపోటీ నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి చనకంటి సాంబమూర్తి,మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ ఆర్.హరినాధరెడ్డిలు తెలిపారు. ఈమేరకు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. సంక్రాంతి సందర్బంగా పుంగనూరు,చౌడేపల్లి,సోమల,సదుం,పులిచర్ల,రొంపిచర్ల మండలాల మహిళలు తమ ఇండ్లముందర ముగ్గులు వేసి సెల్ఫీదిగి,తమ ఐడెంటిటీకార్డుతో పాటూ పేరు వివరాలు పంపాలని సూచించారు.ప్రతి మండలానికి రూ.50,116, రూ.25,116, రూ.5,116లు బహుమతిగా ఉంటుందన్నారు.వివరాలకు ఆయా మండలంలోని బిసివై ప్రతినిధులను సంప్రతించాలన్నారు.

## ఆదరణ ఓర్వలేక ఫ్లెక్సీలు చింపేశారు

పుంగనూరు,జనవరి 10 ప్రభాతవార్త:

తమ నేత చల్లా రామచంద్రారెడ్డికి లభిస్తున్న ఆదరణ చూసి ప్రత్యర్థులు ఓర్వలేక పోతున్నారని దేశం నాయకుడు సయ్యద్‌సుహేల్ అన్నారు. బుధవారం తమ నాయకుడు చల్లాబాబు పర్యటనలో భాగంగా పిచ్చిగుండ్లపల్లి గ్రామంలో దేశం,జనసేన అభిమానులు వేసుకున్న ఫ్లెక్సీలను ప్రత్యర్థులు చింపివేశారన్నారు. ఈమేరకు ఆయన సంఘటనా స్థలంవద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈసంఘటనపై పోలీసులు స్పందించాలన్నారు.ఇలాంటి సంఘటనలకు, దాడులకు పాల్పడితే సహించబోమన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకు పూర్వవైభవం వస్తుందని, తమ నాయకుడు చల్లాబాబును పుంగనూరు నియోజకవర్గం ప్రజలు తప్పక ఆదరించి గెలిపిస్తారన్నారు.

## మృత్యుంజయేశ్వరస్వామికి రూ. 1.36లక్షల ఆదాయం

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త



స్థానిక మృత్యుంజయేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ. 1,36,570లు ఆదాయంగా సమకూరిందని ఇఓ కమలాకర్ తెలిపారు. బుధవవారం స్థానిక ఆలయంలో 3నెలలకు గాను హుండీ లెక్కింపు జరిగిందన్నారు. దేవాదాయధర్మాదాయ భూములు దురాక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామనీ, పట్టణంలోని ఆలయాల స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఏకొల్లు ఎంపిటిసి మృతి

దొరవారిసత్రం, జనవరి 10 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలం ఏకొల్లు సెగ్మెంట్ ఎంపిటిసి యాగాని దొరస్వామి (40) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలారు. బుధవారం ఏకొల్లు గ్రామంలో దొరస్వామి పార్ధికదేహానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు నివాళి అర్పించారు.

## మినీ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

– జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం

చిట్టమూరు, జనవరి 10 ప్రభాతవార్త

ఈ నెల 12వ తేదీన చిట్టమూరు మండలం మల్లాం గ్రామ సచివాలయంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, ఎంపిడిఓ షాలెట్ తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామని, 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమాతో పాటు డిగ్రీ, బిటెక్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతకు జాబ్ మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అలాగే మరో కంపెనీ అయిన యూనిఫార్మ్‌లో ఉద్యోగాల కోసం 10వ తరగతి పాస్/ఫెయిలైన అభ్యర్థులతో పాటు ఇంటర్మీడియట్ పాస్/ఫెయిలైన యువతకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే యువత తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు బయోడేటా ఫారం, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు రావాలని వారు ఈ సందర్బంగా సూచించారు. జాబ్‌మేళా కోసం ఏదైనా సందేహాలుంటే 8143576866, 8919925219 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## లోతువానిగుంట కాలనీవాసుల నిరసన

నాయుడుపేట, జనవరి 10 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట లోతువానిగుంట కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. తుపాను నష్టపరిహారం అందేలేదని వారంతా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట ప్రాంతంలో నివసించే వారంతా దినసరి కూలీలు. ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపాను సమయంలో ఇళ్లలోకి నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత బియ్యం, నగదు కాలనీవాసులకు అందలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చే వరకు కార్యాలయం వద్ద నుంచి లేచేది లేదని భీష్మించారు.

## ఘనంగా సాయి విద్యానికేతన్ పాఠశాల తృతీయ వార్షికోత్సవం

గూడూరు, జనవరి 10 ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో బుధవారం సాయి విద్యానికేతన్ పాఠశాల తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల తృతీయ వార్షికోత్సవం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఎంతో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు మరియు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి వార్షికోత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు. అందులో భాగంగా కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు అరుణ్, ఉపాధ్యాయులు జమీర్‌బాషా, మల్లికార్జున, మనోజ్, దయాకర్, బాలకృష్ణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్దాలిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కోట, జనవరి 10 ప్రభాతవార్త



కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కోట మండలంలో నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు బైరప్ప చెప్పారు. బుధవారం కోట పట్టణంలోని కేశవరం, మద్దాలి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బైరప్ప మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక ప్రజారంజక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. 17 రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ రైతుల పొలాలపై పిచికారి చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు, ఎంపిపి దాసరి అంజమ్మ, ఎంపిడిఓ భవాని, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోట మండల వైసీపీ కార్యదర్శిగా సురేంద్ర

కోట, జనవరి 10 ప్రభాతవార్త



కోట మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కర్లపూడి గ్రామానికి చెందిన పాముల సురేంద్రను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన వైసీపీ సీనియర్ నాయకులు సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డికి, మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తన శక్తి వంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేస్తానని సురేంద్ర చెప్పారు.

## విధులకు హాజరుకాని అంగన్‌వాడీలకు నోటీసులు

కోట, జనవరి 10 ప్రభాతవార్త

విధులకు హాజరుకాని అంగన్‌వాడీలకు నోటీసులు అందజేస్తున్నట్లు కోట సిడిపిఓ మునికుమారి చెప్పారు. కోట ప్రాజెక్టు పరిధిలో 203 మంది అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారని, 205 మంది హెల్పర్లుగా పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. వీరందరికీ నోటీసులు పోస్టు ద్వారా పంపుతున్నట్లు మునికుమారి చెప్పారు.ప్రభుత్వంసూచించిననోటీసులకు పది రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలన్నారు. లేదంటే ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కోట ప్రాజెక్టు పరిధిలో ఐదు కేంద్రాల్లోని గోడలకు నోటీసులు అంటించామని తెలిపారు. మరో ఐదుగురికి పోస్టుల ద్వారా నోటీసులు పంపినట్లు తెలిపారు.

## తడలో ఆడుదాం ఆంధ్రా పోటీలు

తడ, జనవరి 10 ప్రభాతవార్త



తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మొదలయ్యాయి. మండల స్థాయిలో జరిగే ఈ పోటీలను ఎంపిపి కొళవి రఘురెడ్డి ప్రారంభించారు. ఎంపిడిఓ అమోస్‌బాబు, వైసీపీ నాయకులు టి.కోదండం, టి.శశికుమార్, పెరియవట్టు సర్పంచ్ సిహెచ్ పెదగోవిందశెట్టి, ఎంఇఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. కొద్దిసేపు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తడ మండలంలో ముఖ్యంగా పులికాట్ జాలర్లు, తమిళనాడు సరిహద్దుల్లోని యువకులు ఇటీవల క్రీడలపై ఆసక్తిని ఎక్కువగా ప్రదర్శిస్తున్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలోను వారి ప్రతిభ మరొక సారి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## క్రీడలు పట్ల యువత మక్కువ చూపాలి

వైసిపి మండల కన్వీనర్ వెందోటి కార్తిక్

బాలాయపల్లి, జనవరి 10, ప్రభాతవార్త

యువత క్రీడల పట్ల మక్కువ చూపాలని వైసిపి మండల కన్వీనర్ వెందోటి కార్తిక్ రెడ్డి తెలిపారు. మండలంలోని గొట్టికాడు గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలా క్రీడా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి బాలాయపల్లి మండలంకు మీ గ్రామాలకు కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. గెలిచిన టీమ్‌కు ప్రోత్సాహ బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పజలు ఇబ్బంది పడుతున్నారని చీపురు పట్టి శుభ్రం చేశాను

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద

వెంకటగిరి, జనవరి 10, ప్రభాతవార్త



మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో చెత్తాచెదారం పేర్కొని దుర్గంధ పూరితమైన వాసన నెలకొనడం తాను కౌన్సిలర్లు కలిసి చెత్తను తొలగించి శుభ్రం చేయాలని చీపురులు పట్టినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ 15వ వార్డు కౌన్సిలర్ అయిన దొంతు శారద తెలిపారు. బుధవారం వెంకటగిరి పట్టణంలోని రాజు వీధి తాజ్ మహల్ సంధులలో పేరుకుని ఉన్న చెత్తాచెదారాన్ని కౌన్సిలర్‌తో కలిసి ఆమె శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికులకు వ్యతిరేకంగా కాదని, వారి సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించేందుకు సానుకూలంగా ఉందన్నారు. ప్రజల ఇబ్బంది దృష్టిలో పెట్టుకుని చెత్తాచెదారాన్ని తొలగించడం కష్టమైనా తాము సిద్ధపడినట్లు ఆమె తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని చూసుకోవాల్సిన బాధ్యత తమపై కూడా వుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలయ్య, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు రాధమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి

వాకాడు,జనవరి 10 ప్రభాతవార్త



మండల కేంద్రమైన వాకాడులో బుధవారం డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం అంధ్రా క్రీడా పోటీలు జరిగాయి. మండల స్థాయి లో ఈ పోటీలు ఎంపిడివో గోపినాథ్ పర్యవేక్షణలో జరిగాయి.ఈ పోటీలకు ముఖ్యఅతిథిలుగా వాకాడు సొసైటి అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి, ఉపసర్పంచ్, పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి విచ్చేశారు. అనంతరం క్రీడాకారులను వారు పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్స్‌ను దామోదర్ రెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా కీడాపోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. యువ క్రీడ కారులను ప్రోత్సహించేందకు ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడా కారులు డివిజన్ స్థాయిలో పాల్గొనాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్‌కుమార్, నాయకులు రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు. అంతక ముందు రాజశేఖర్‌రెడ్డి చేతలు మీదగా క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

## జేవివి ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం

గూడూరు, జనవరి 10, ప్రభాతవార్త

గూడూరు జనవిజ్ఞాన వేదిక, గూడూరు వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి గూడూరు నందు జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యాదానం తరువాత రక్తదానం ఎంతో గొప్పదని నిరుపేదలకు అవసరమైన రక్తం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ నందు ఎలాంటి చార్జీలు లేకుండాపేదలకుఅందిస్తారని అందుకోసం జేవివి ఆధ్వర్యంలో రక్తదానం చేశామని ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిదని తెలిపారు.బ్లడ్‌బ్యాంక్ ఇంచార్జి సందీప్, రాజేంద్రప్రసాద్, మౌలాలి, చెంచునారాయణ, రామమోహన్, మస్తాన్, ప్రభాకర్, చిరంజీవి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలు మృతి చెందడం బాధాకరం

మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

చిల్లకూరు, జనవరి 10, ప్రభాతవార్త



పార్టీ కార్యకర్తలు మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం ఓడూరు గ్రామం ఎస్టీ కాలనీ నందు స్వర్గస్తులైన పార్టీ కార్యకర్త సగటూరు శ్రావణి, ఎగువరాజు పాలెం గ్రామం నందు స్వర్గస్తులైన పార్టీ కార్యకర్త వడ్డిపల్లి అంకయ్యల భౌతిక కాయాలనికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 10 వేల రూపాయిలు ఆర్థిక సహాయం అందించారు. తెలుగుదేశం పార్టీకి ఎంతో కాలం నుండి పార్టీలో ఉంటూ పార్టీకి అన్ని విధాలుగా అండగా ఉన్న వ్యక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, నాయకులు కీర్తిపాటి కోటేశ్వర రాజు, గుండాల శ్రీనివాసులు, చిట్టేటి శ్రీనివాసులు ఉన్నారు.

## చెరువులోకి ఫ్యాక్టరీ వ్యర్థాలు

### - ఎస్ఎస్జె ఫ్యాక్టరీ ఎదుట తమిళనాడు వాసుల ధర్నా

ఎస్ఆర్‌పురం, జనవరి 10 ప్రభాతవార్త:



మండల పరిధిలోని నెలవాయి గ్రామ సమీపంలో వున్న ఎస్ఎస్జె చక్కెర ఫ్యాక్టరీ వ్యర్థాలను సమీపంలోని తమిళనాడు రాష్ట్రంలోని చెరువులో విడుదల చేస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలు బుధవారం ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళ నాడు రాష్ట్ర ప్రజలు మాట్లాడుతూ చక్కెర ఫ్యాక్టరీ వ్యర్థాలను చెరువులోకి విడుదల చేస్తుండటంతో పరిసరాలు దుర్గంధం కావడంతో పాటు నీరు కలుషితమై పశువులు మృతి చెందుతున్నాయని ఆరోపించారు. గత కొన్ని రోజులుగా ఫ్యాక్టరీ నుండి పెద్ద స్థాయిలో వ్యర్థపదర్థాలు విడుదల అవుతుండటంతో ప్రజలు దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫ్యాక్టరీలో విధులు నిర్వర్తించే సిబ్బంది ఎవరు ఫ్యాక్టరీ నుండి వెలుపలికి రాకుండా గేట్లు మూసి తమిళనాడు రాష్ట్ర వాసులు అడ్డుకొన్నారు. స్థానిక ఎస్ఐ షేక్షావలీ రైతులతో మాట్లాడి ఫ్యాక్టరీ నుండి వ్యర్థాలు తమిళనాడు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వడంతో ప్రజలు, రైతులు ధర్నాను విరమించారు.

## పక్కాగా గ్రామ స్థాయి వార్షిక ప్రణాళికలు

### - జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి




చిత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త:

2024-25 గ్రామ స్థాయి వార్షిక ఆర్థిక ప్రణాళికలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశమందిరంలో బుధవారం రెండవ రోజు గ్రామ పంచాయతీల అభివృద్ధి వార్షిక ప్రణాళిక 2024-25పై రెండవ రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన వార్షిక ప్రణాళికలను పక్కాగా సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాన అభివృద్ధి, సంక్షేమంను దృష్టిలో వుంచుకొని గ్రామ పంచాయతీ స్థాయి నుండి ప్రతి సిబ్బంది గత అనుభవాలను ఉపయోగించి జిల్లాకు ఉపయుక్తమైన 2024-25 ఆర్థిక సంవత్సర వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి గ్రామసభ విజయవంతం చేయాలన్నారు. వార్షిక ప్రణాళిక రూపకల్పనలో అన్ని దశలను క్రమంగా పూర్తి చేసి జనవరి 31వ తేదీలోపు ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి ప్రస్తుతం అమలు అవుతున్న నవరత్నాలు, ఉపాధి హామీ, నాడు-నేడు, జలజీవన్ మిషన్, విద్యావైద్య రంగాలకు సంబంధించిన పథకాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు వినియోగించుకొని పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఇఒఆర్డీలకు సూచించారు. అలాగే సకాలంలో పెండింగ్ బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే దాదాపు 30 శాఖల ద్వారా సమాచారం సేకరించి ప్రణాళికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ షణ్ముగరామ్, పలమనేరు డిఎల్‌డిఓ ఉమావాణి, సంబంధిత

## ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: చల్లాబాబు

పుంగనూరు, జనవరి 10, ప్రభాతవార్త:



చంద్రబాబు అధ్వర్యంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రతిఇంటికి సంక్షేమపథకాలు అందచేస్తామని తెలుగుదేశం నాయకుడు చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుడిసిబండ పంచాయతీ గూడూరుపల్లి గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకూ వెళ్ళి తెలుగుదేశం పార్టీ మాత్రమే రాష్ట్రభవితను కాపడుతుందని, తెలుగుదేశంకు మద్దతివ్వాలని కోరారు. ఈసందర్భంగా ఆయనకు గ్రామంలో పెద్దఎత్తున స్వాగతం లభించింది. కార్యక్రమంలో మండలానికి చెందిన పార్టీశ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేశం నాయకుడు సయ్యద్‌సుహేల్‌బాషా, అసూరిబాలాజీ, వెంకటరమణారెడ్డి, పోలీస్‌గిరి తదితరులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

## టిటిడి చీఫ్ పిఆర్ఓ రవికి చీఫ్ ఫోటోగ్రాఫర్ శేఖర్‌కు సన్మానం



తిరుమల, జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి ధార్మికసంస్థలో దేవునిచెంత, భక్తులకు సేవలందిస్తూ పదోన్నతి పొందిన చీఫ్ పిఆర్ఓ డాక్టర్ తలారి రవిని, చీఫ్ ఫోటోగ్రాఫర్ శేఖర్‌ను రాయలసీమ రంగస్థలి నేతలు కలిశారు. బుధవారం సాయంత్రం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి టిటిడి పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరువురిని దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## టిడిపి వస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం

### గాలి భానుప్రకాశ్

పుత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త :



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవ్వాలంటే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని టిడిపి నగరి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రూరల్ మండలం తడుకు పంచాయతీలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి గ్యారంటీ పథకలు వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కష్టాల్లో ప్రజలకు మేలు జరగాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటేయాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి కనుచూపు మేరలో కనిపించడం లేదని, వైసిపి పాలకులు రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పుల్లో ముంచేశారని తెలిపారు. రాష్ట్రంలో గత నాలుగున్నర ఏళ్లలో వైసిపి ప్రభుత్వం కొత్తగా పరిశ్రమలు తీసుకురాలేకపోయిందని, దీని వల్ల యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమే కాకుండా ఇంటి పన్ను, కరెంట్, ఆర్టీసి బస్సు ఛార్జీల పెంపుతో పాటు కొత్తగా చెత్తపై కూడా పన్ను వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా నగరి నియోజకవర్గంలో తన తండ్రి దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప తర్వాత ఏ విధమైన అభివృద్ధి జరగలేదని తెలిపారు. నగరి అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యుత్ సదాశివపురంలో ప్రారంభించిన పర్యటన వేణుగోపాలపురం, తిరుమలరాజుకండ్రిగ, చంద్రప్పనాయుడుకండ్రిగ, తడుకు, మజ్జిగకుంట వరకూ సాగింది. ప్రతి గ్రామంలోనూ మహిళలు భానుప్రకాశ్‌కు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, స్థానిక సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్, నాయకులు ఆది మందడి, గంగాధరం, దేశమ్మ, భాస్కర్, హరి, ఆదినారాయణ, లోకేష్, గోపి, మధు, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవచనకర్త రంగనాథ్‌కు నూతన వస్త్రాలు

తిరుపతి, జనవరి 10ప్రభాతవార్త:

ధనుర్మాసం సందర్భంగా అన్నమాచార్యకళామందిరంలో జరుగుతున్న ఆద్యాత్మిక ప్రవచనాల పారాయణంలో ప్రవచన కర్త ఆచార్య రంగనాథ్ విశ్లేషణలు అద్భుతమని రాయలసీమ రంగస్థలి నేతలు కొనియాడారు. బుధవారం ఆయన ఆలపించిన భక్తిపాటలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగాఆచార్య రంగనాథ్‌ను, కళాకారుని ద్వారం లక్ష్మిని నూతన వస్త్రాలు అందజేశారు. కస్పాపద్మనాభం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన సు బ్రమణ్యంనాయుడు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి రూ.1.55కోట్లు



శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద లెక్కించారు. ఆలయ ఇఓ కె.యస్ రామారావు పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు నగదు రూ.1.కోటి 55లక్షల21 వేల,259లు వచ్చింది. ఇక బంగారు 000.043.000, వెండి నాగపడగల రూపంలో 415.400కిలోలు విదేశీ కరెన్సి 172 నోట్లు వచ్చింది. విదేశీ కరెన్సి అమెరికా 110, మలేషియా 15, జపాన్ 29 ఇతర దేశాలకు సంబందించినవి ఉన్నట్లు ఇఓ వివరించారు. ఈ రాబడి 28లకు సంబంధించినదని వివరించారు. ఈ లెక్కింపులో ఆలయ ఇఓ కె.యస్ రామారావుతో పాటు ఇఇ నూకారత్నం డిఇఇ శ్రీనివాసులురెడ్డి, డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, మల్లికార్జున్ ప్రసాద్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్‌లు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

చిల్లకూరు, జనవరి 10, ప్రభాతవార్త



చిల్లకూరు గ్రామం జడ్పి బాయ్స్ హై స్కూల్‌లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఇది అందరి ఆట కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయిలో వివిధ నైపుణ్యాలు కలిగిన వారిని ఎంపిక చేసి వారిని మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్రికెట్, కోకో, వాలీబాల్, కబ్బడ్డీ, బ్యాట్‌మిటన్ ఆటలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ ఆటలో పాల్గొనేందుకు ఉత్సాహాన్ని చూపిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డివివి సూరిసాయి, మండల మాజీ కన్వీనర్ అన్నంరెడ్డి పరంధామ రెడ్డి, జడ్పిటిసి మన్యం సీనయ్య, ఎంపిటిసిలు దార కోటేశ్వరావు, ఎల్లసిరి జానకిరామ్, సర్పంచులు, స్థానిక నాయకులు ఓడూరు బాలకృష్ణారెడ్డి, దిలీప్ రెడ్డి, యోగి, పంచాయితీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అభిమానులు పాల్గొన్నారు.

## యువతలో ఉత్సాహం నింపేందుకే ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలు

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, జనవరి 10, ప్రభాతవార్త



యువతలో ఉత్సాహం నింపేందుకే సిఎం జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన వెంకటగిరి దక్కిలిలో రెండో విడత ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉండేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సిఎం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడలు పట్ల శ్రద్ధ చూపాలని తెలిపారు. క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు. శారీరక శ్రమ ఉంటే మానసిక ఉల్లాసం పెరుగుతుందని యువతకు సూచించారు. 50 రోజులు పాటు పండుగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువతకు క్రీడల టీషర్టులను పంపిణీ చేశారు. ఈ నెల 19వ తేది 400 కోట్ల రూపాయిలతో స్మృతి వనంలో 150 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతున్నట్లు తెలిపారు. వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణకు విరివిగా తరలిరావాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జేసిస కన్వీనర్ చింతల శ్రీనివాసులు రెడ్డి, ఎంపిడిఓ ప్రసన్న కుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్ నాయుడు, వేణు నాయుడు, బాలకృష్ణ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## టిక్కెట్‌ల కేటాయింపులో మాదిగలకు ప్రాధాన్యత కల్పించండి

### -ఎంపీ మిథున్‌రెడ్డిలకు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

కాణిపాకం, జనవరి 10 ప్రభాతవార్త:



రానున్న ఎన్నికల్లో టిక్కెట్‌ల కేటాయింపులో మాదిగలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వరదరాజులు మాదిగ డిమాండు చేశారు. ఈమేరకు ఆయన బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజుతో కలిసి విజయవాడలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని కలసి పూతలపట్టు నియోజకవర్గ వైకాపా టిక్కెట్ కేటాయింపు విజమై చర్చించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు తగిన ప్రాధాన్యత నివ్వలేదని తెలిపారు,. ఈవిధానాన్ని మార్చాలని ఎంపీని కోరారు. అలాగే ఈదఫా ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గం కోటా కింద పూతలపట్టు అసెంబ్లీ టిక్కెట్‌ను చిత్తూరు నగరంకు చెందిన కోడిగుట్ట వెంకటేష్‌కు కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వివరించారు. ఈకార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు, బిసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్ఞాన జగదీష్‌తో పాటు పలు జిల్లాలకు చెందిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో సినీనటుడు సుధీర్‌బాబు

శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయు లింగేశ్వరుని బుధవారం వర్ధమాన సినీనటుడు సుధీర్‌బాబు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయాధికారులు సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ప్రత్యేకంగా వేదపండితులచే ప్రత్యేక పూజలు జరిపించారు. అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందించారు.

## నీ వయస్కు తగ్గా మాటలు మాట్లాడు మోహిత్

### -తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి

తిరుపతిరూరల్, జనవరి 10 ప్రభాతవార్త:



చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాక్యలు....తాతకు దగ్గులు నెర్పే విధంగా....హాస్యాస్పదంగా ఉన్నాయని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ. ఈశ్వరరెడ్డి ఎద్దేవ చేసారు. మాజీ ముఖ్యమంత్రిని పట్టుకుని.... తాత అని సంబోధించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ మోహిత్ నీవు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి దిగే నీవు...సంస్కారవంతమైన వాక్యలు చేయాలని హితవు పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదైనట్లు కోడై కూస్తుందని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైకాపా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా పులివర్తి నాని గెలుపు తథ్యమని జోస్యం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగూరు శ్రీనివాసులు, వైకుంఠం శ్రీధర్‌నాయుడు, ఈశ్వరయ్య, గోఫి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఉత్సవాలు

### తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



చంద్రగిరి, జనవరి 10 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవతగా సత్యప్రమాణాలకు నెలవైకొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తుడా ఛైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఈ నెల 14 నుండి 18 వరకు నిర్వహించతలపెట్టిన అమ్మవారి సంక్రాంతి ఉత్సవాల నిర్వహణపై ఆలయం వద్ద బుధవారం ఆయన పాలక మండలి, ఆలయ ఈఓ, ఉద్యోగులు, వివిధ విభాగాల అధికారులు, ప్రజలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి ఉత్సవాలను సమష్టి కృషితో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనీయకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా కొండచుట్టు ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ బాలాజీ నాయక్, వైస్ ఎంపిపి వెంకటరత్నం, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, ఈఓ సి.ఆర్.తిమ్మారెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ హిమబింధు, ఏఈఓలు నాగరాజు, హరిప్రసాద్, పంచాయతీ, ఈఓ మహేశ్వరయ్య, బండారు హేమచంద్రారెడ్డి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక

చిల్లకూరు, జనవరి 10, ప్రభాతవార్త



మండల పరిధిలోని చింతవరం ఉన్నత పాఠశాలలో 2009 - 2010లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల సమ్మెళనం బుధవారం నిర్వహించారు. దాదాపుగా 80 మంది విద్యార్థులు 25 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం పాత విషయాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివ సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చంద్రయ్య, వెంకటేశ్వర్లు, సునీత, సుమ, మంజు శ్రీ, వాసు దేవ కుమార్, మాధవయ్యతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం జరిగింది.

## ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పిఇటికి గాయాలు

### - చిత్తూరు ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించాలని జడ్పీ సిఇఓ ఆదేశాలు



చిత్తూరు, జనవరి 10 ప్రభాతవార్త: యాదమరి మండలం 14-కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాఠశాలలో 184 గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పిఇటిగా విధులు నిర్వహిస్తున్న మాధవి గాయపడ్డారు. 14-కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం కొట్టాలం, కోణాపల్లి జట్ల మధ్య కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న సమయంలో పిఇటి మాధవి టైమర్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో కబ్బడ్డీ క్రీడాకారులు ఒక్కసారిగా పిఇటి మాధవిపై పడిపోడంతో ఆమెకు కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఈమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తీసుకెళ్ళారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పిఇటి మాధవి గాయపడిందని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు దృష్టికి వెళ్ళడంతో ఆయన జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిని హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించి నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిఇటి మాధవిని పరామర్శించి ఆమెకు నాణ్యమైన వైద్యం అందించి త్వరగా కోలుకొనేలా చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ రవికుమార్, డిఎస్‌డిఓ బాలాజీ, ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాంకర్లనీటి బిల్లులకై వైకాపా నేతల నిరసన

శాంతిపురం, జనవరి 10 ప్రభాతవార్త



గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన తమకు బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నల్లరాళ్లపల్లి క్రాస్ వద్ద నీటి సరఫరా చేపట్టిన వైకాపా నేతలు నిరసన తెలిపారు. 2019జూన్ నుంచి 2021 జూలై వరకు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశామని అయితే ఇంతవరకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నా మన్నారు. దాదాపు 9కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం తాము అప్పులపాలయ్యామని ఫైనాన్సులు కట్టలేక ట్రాక్టర్లను ఫైనాన్షియర్లు తీసుకెళ్లిపోయినట్లు వాపోయారు. నగలు తాకట్టుపెట్టినట్లు పలువురు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

## రిజిస్ట్రేషన్లకు లంచాలు అడిగితే నేరుగా ఫిర్యాదు చేయండి - జిల్లా రిజిస్ట్రార్

కుప్పంరూరల్, జనవరి 10 ప్రభాతవార్త

కుప్పం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు ఎవరైనా లంచాలు అడిగితే డాక్యుమెంట్ రైటర్లు నగదు డిమాండ్ చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సూచించారు. కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూల్ రాణి అనే కథనం రెండు రోజుల క్రితం వెలువడిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ఆయన కుప్పంకు చేరుకుని విచారణ చేపట్టారు. రిజిస్ట్రేషన్ల నిమిత్తం వచ్చిన పలువురు ప్రజలను విచారించారు. ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా, డాకు ్యమెంట్ రైటర్లు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారా అనే అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ల సమయంలో ఇబ్బందులు ఎదురైతే 7093921636నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

